

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి

ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 23 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఆర్‌డిఒ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ

పింఛన్లు తేల్చండి..!

రెండు జిల్లాల్లో దాదాపు పది వేల దరఖాస్తులు పెండింగ్
కొత్త ప్రభుత్వం రాకతో అందరిలోనూ కొత్త ఆశలు
గత ప్రభుత్వం నిబంధనల పేరుతో కొర్రీలు
అర్హులను తేల్చి పింఛను అందించాలని వేడుకోలు
అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

'నిడమర్రు మండలం అడవికొలను గ్రామానికి చెందిన పి.మహేష్ వికలాంగుల కోటాలో పింఛను కోసం దరఖాస్తు చేసుకుని చాలా కాలం గడిచింది. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం మారింది. తన దరఖాస్తు పరిశీలించి పింఛను అందేలా చూడాలని కోరుతున్న పరిస్థితి నెలకొంది. పింఛను అందితే వైద్యానికైనా చేయూతగా ఉంటుందని ఆ కుటుంబం ఆశిస్తోంది.'

'భాస్కర్‌రావు అనే వ్యక్తి ఈ ఏడాది జనవరిలో వృద్ధాప్య పింఛనుకు దరఖాస్తు చేసుకున్నాడు. గత ప్రభుత్వ హయాంలో మంజూరు కాలేదు. ఇంతలో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారింది. తనకు పింఛను ఎప్పటికొస్తుందోనన్న ఆందోళన ఆయనను వెంటాడుతోంది. పింఛన్ సొమ్ము వస్తే తనకు ఆసరాగా ఉంటుందని ఎదురుచూస్తున్నాడు.'



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న మహేష్, భాస్కర్‌రావులే కాదు.. వృద్ధాప్య, వికలాంగుల, వితంతు వంటి వివిధ రకాల పింఛన్ల కోసం రెండు జిల్లాల్లో దాదాపు పది వేల మంది ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ఏటా జనవరి, జులై నెలల్లో కొత్త పింఛన్లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ప్రకటించేది. ఈ ఏడాది జనవరిలో కొత్త పింఛన్లకు సంబంధించి లబ్ధిదారులను ప్రకటించలేదు. దీంతో ఎంతోమందికి అర్హత ఉన్నా పింఛన్ అందుకోలేని పరిస్థితి. కొత్త పింఛన్ల కోసం పశ్చిమగోదావరి జిల్లాలో 4,200 మంది, ఏలూరు జిల్లాలో ఐదు వేల మందికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరంతా 2023 జులై తర్వాత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారే. పెరిగిన ధరలు, ఆరోగ్య సమస్యల నేపథ్యంలో వృద్ధులు, వికలాంగులు పింఛను సొమ్ము వస్తే ఆసరాగా ఉంటుందని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం అనేక నిబంధనలను తెరపైకి తెచ్చి అర్హులకు సైతం పింఛన్లను నిలిపివేసింది. అర్హత ఉన్నా పింఛను అందక ఎంతోమంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. కరెంటు బిల్లు మూడొందల యూనిట్లు దాటిందని, భూములు, కార్లు ఉన్నాయంటూ ఎంతోమందికి పింఛను ఆపేసింది. అవేమీ తమకు లేవని ఆయా శాఖల అధికారుల నుంచి పత్రాలు తెచ్చి మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకున్నా పింఛను మాత్రం రాలేదు. కుమారులకు మూడొందల యూనిట్లు దాటి కరెంటు బిల్లు వస్తే వారి తల్లిదండ్రులకు పింఛను ఆపేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. కుమారుడికి సచివాలయ ఉద్యోగం వచ్చిందని తల్లిదండ్రులకు పింఛను నిలిపివేసిన పరిస్థితులు నెలకొన్నాయి. భూములు లేకపోయినా ఉన్నాయంటూ పింఛనుకు గండికొట్టారు. దీంతో అలాంటి వారంతా పింఛన్ల కోసం కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. పింఛన్ సొమ్మును రూ.నాలుగు వేలకు పెంచింది. జులైలో పెంచిన పింఛను సొమ్మును అందించారు. దీంతో తమకు అర్హతున్నా పింఛను రాకపోవడంపై బాధితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం జీవన పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వయస్సు పైబడినవారిని అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. షుగర్, బిపి, కీళ్ల నొప్పులు వంటి వ్యాధులు సర్వసాధారణం అన్నట్లు మారిపోయాయి. మాత్రలు మింగితే తప్ప రోజు గడిచే పరిస్థితి లేదు. అనారోగ్య సమస్యలతో పనికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వృద్ధులు, వికలాంగులు, అనారోగ్య సమస్యలతో మంచానపడ్డ వారికి పింఛన్ సొమ్మే జీవనాధారంగా మారింది. పెరిగిన ధరల నేపథ్యంలో సామాన్య కుటుంబాల్లో రోజు గడవడమే పెద్ద సవాల్‌గా మారింది. దీంతో ఇంట్లో పెద్దలను చూసుకోవడం మరింత కష్టంగా మారుతోంది. పింఛను వస్తే కనీసం వారికి కావాల్సిన మందులు వంటి వాటి కోసం కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సిన పరిస్థితి తగ్గుతుంది. దీంతో అర్హత ఉన్నా చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు జిల్లాల్లో ఈ సంఖ్య పదివేల వరకు ఉండటంతో పరిస్థితి ఎంతో అర్థం చేసుకోవచ్చు.

కొత్త పింఛన్ల ఎంపికపై నిర్ణయం ఎప్పుడో..

పింఛన్ల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి కొత్త ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో దరఖాస్తు దారులంతా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే కొత్త పింఛన్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. ఇది జరిగితే ఎంతోమంది ఊరట పొందనున్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

'మీ కోసం'లో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ జె.ఉదయభాస్కరరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన 129 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకొని జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి జిల్లా కేంద్రానికి వస్తుంటారని, వారి పట్ల తగినంత శ్రద్ధ చూపి వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని తెలిపారు. వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి

కలెక్టర్ వద్ద కార్మికులు, సిఐటియు నేతల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కలెక్టరేట్లో సోమవారం జిల్లా కలెక్టర్ నాగరాణికు వినతిపత్రం అందజేశారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.కోటేశ్వరరావు, మండ సూరిబాబు మాట్లాడుతూ జిల్లాలో భవన నిర్మాణ కార్మికులందరి పేర్లు సంక్షేమ బోర్డులో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు బోర్డు ద్వారా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జిఒ 1214 ద్వారా పథకాలను ఆపేసిందని, వెంటనే ఆ జిఒను రద్దు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లైములను క్లియర్ చేయాలని, 50 ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దూలం ప్రసాద్, ఎర్రంశెట్టి చిన్న సుబ్బరాజు, వీరవల్లి మాధవ, రాజు, కేసిరెడ్డి రాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, సిఐటియు నేతలు

దళితులపై దాడులు అరికట్టాలి

కెవిపిఎస్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - గణపవరం


రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని కెవిపిఎస్ మండలం కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం కెవిపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో దళితులపై దాడిని ఖండిస్తూ అర్థవరం గ్రామంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగరిక సమాజంలో ఆటవిక చర్యలు తగవన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పేరూరు గ్రామంలో కులహంకారంతో కదిరి ప్రభాకర్‌పై వేడి నూనె పోయడాన్ని ఆయన ఖండించారు. కర్నూలు జిల్లా ఆదోని మండలంలో నాగనాదహళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మపై కిరాతకంగా ట్రాక్టర్‌తో తొక్కించి హత్యచేయడం దారుణమని విమర్శించారు. పాత రాజకీయ కక్షలతో దళితపేటపై ఆయుధాలతో సామూహిక దాడిచేయడం దారుణమని, దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఇండియన్ మిషన్ నాయకులు బళ్లారపు అశోక్ మాట్లాడుతూ నిరంతరం దళితులపై దాడి చేయడం సభ్య సమాజం సిగ్గుపడేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న వంశీ, కట్టూరి ప్రసాద్, ఏరిచర్ల కుమార్, మునుకొండ బద్రి, మాదాసి చిన్న పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

నదులు అనుసంధానం చేయాలి

మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు: దేశాన్ని తీవ్ర దుర్భిక్ష కరువు కాటకాల నుంచి రక్షించుకోవాలంటే నదుల అనుసంధానం ద్వారానే సాధ్యమని 50 సంవత్సరాల క్రితమే చెప్పిన ఇంజనీరింగ్ పితామహుడు కెఎల్.రావు అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల రూపకర్త కెఎల్ రావు తెలుగు జాతికే గర్వకారణం అని మంత్రి నిమ్మల అన్నారు. విజయవాడలో సోమవారం దుర్గ ఘాట్ వద్ద మాజీ కేంద్రమంత్రి కెఎల్ రావు 122వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ పితామహుడు కెఎల్ రావు ఆలోచనలకనుగుణంగా ప్రపంచంలోనే నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టింది సిఎం చంద్రబాబు అన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం చంద్రబాబు చేస్తారన్నారు. రాష్ట్ర విభజన నష్టం కన్నా జగన్ ఐదేళ్ల పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగింది అన్నారు. జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టుతో పాటు అన్ని ప్రాజెక్టులు విధ్వంసానికి గురయ్యాయని తెలిపారు. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ప్రధాని మోదీ సహకారంతో సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళున్నారని మంత్రి నిమ్మల తెలిపారు. విజయవాడ సెంట్రల్ ఎంఎల్‌ఎ బొండా ఉమా, జలవనరుల శాఖ సలహాదారులు ఎం.వెంకటేశ్వరరావు, జల వనరుల శాఖ ఇఎన్‌సి కె.శ్రీనివాస్, మైనర్ చీఫ్ ఇంజనీర్ సాయిరాం ప్రసాద్, సిఇసి కుమార్, విజయవాడ కార్పొరేటర్ యు.వెంకటేశ్వరరావు, ఎ.గోపాలకృష్ణ తదితరులు రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్లను మంత్రి రామానాయుడును సత్కరించారు.


నివాళులర్పిస్తున్న నిమ్మల

తూడు, గుర్రపు డెక్క తొలగించాలి

ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - ఉండి

బొండాడ మేజర్ డ్రెయిన్, యండగండి మీడియం డ్రెయిన్‌లలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క చెత్తాచెదారాన్ని యుద్ధ ప్రాతిపదికన తక్షణమే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టి తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్, యండగండి వినియోదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పివిఎస్ గోపాలకృష్ణరాజు మాట్లాడుతూ యండగండి మీడియం డ్రెయిన్, బొండాడ మేజర్ డ్రెయిన్‌లలో మట్టి పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీటిపారుదల వ్యవస్థకు తీవ్ర అవరోధాలు ఎదురవుతున్నాయన్నారు. ఇటీవల గుర్రపు డెక్క తొలగింపునకు రసాయనాలు స్ప్రే చేయగా మరుసటి రోజే వర్షం రావడంతో గుర్రపు డెక్క తొలగింపుకు అవరోధం ఏర్పడిందని వారు వాపోయారు. మురుగు కాల్వలలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క, చెత్తాచెదారం తొలగింపు పనుల కోసం ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు కృషి చేయడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో డ్రెయిన్ల ప్రక్షాళన పనులపై పూర్తిగా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. ఈ ప్రభుత్వమైనా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తవిటి నాయుడు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

మెరుగైన విద్యాబోధన సాగించాలి

జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావు

ప్రజాశక్తి - భీమవరం

మెరుగైన విద్యాబోధన విద్యార్థులను అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశమై కాంట్రాక్ట్ అధ్యాపకుల బదిలీలపై చర్చించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాల స్థాయిలో మెరుగైన విద్యనందిస్తే ప్రయోజకులవుతారని, దీనికి అధ్యాపకులు కృషి చేయాలని తెలిపారు. కళాశాల స్థాయిలో ఉద్యోగావకాశాలు వస్తే వారు ఆర్థికంగా మెరుగైన రీతిలో ఉండడంతో పాటు, కుటుంబానికి ఆసరాగా నిలుస్తారన్నారు. కళాశాలలో చేరడానికి వచ్చినప్పుడే ఏ కోర్సు అయితే వారికి ప్రయోజనం ఉంటుందో సూచనప్రాయంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పాలకొల్లు ఎఎస్ఎన్ఎం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరి, డిఎన్ఆర్ ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ పి.శోభారాణి, పెంటపాడు డిఆర్‌జి కళాశాల ప్రిన్సిపల్ ఎన్.వెంకటేశ్వరరావు, దుంపగడప వివి.గిరి కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.యోగేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావు

వనరుల ఆధారిత జీవనోపాధి కల్పించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లాలో ఉన్న మహిళా సంఘాల ద్వారా వనరుల ఆధారిత జీవనోపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్ఎస్ ప్రెసిడెంట్ జిల్లాలో మహిళా సమాఖ్యల ద్వారా చేస్తున్న జీవనోపాధి కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో వనరుల ఆధారిత జీవనోపాధి కార్యక్రమాలలో సంఘాలు పాల్గొవాలని సూచించారు. కొబ్బరి అందుబాటులో ఉన్న చోట కొబ్బరి ఆధారిత కార్యక్రమాలు, మత్స్యకార ప్రాంతాల్లో మత్స్య ఆధారిత కార్యక్రమాలు, కూరగాయలు పెంపకం, నర్సరీల పెంపకం వంటి జీవనోపాధి కార్యక్రమంలో మహిళా సంఘాలు చురుకుగా పాల్గొనాలన్నారు. మహిళలు, పిల్లలు ఆరోగ్యం, పోషకాహారం, రక్తహీనత వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాలు జరగకుండా తల్లిదండ్రులకి అవగాహన కల్పించాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే సమాజం ముందుకెలుతుందని తెలిపారు. అనంతరం డిఆర్‌డిఎ పిడి వేణుగోపాల్ మండలాల వారిగా అందిస్తున్న జీవనోపాధి కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ డిపిఎంలు డి.వెంకటేశ్వరారావు, కె.శ్రీనివాస్, కుసుమ కుమారి, ఎం.శ్రీనివాస్ ప్రసాద్, బి.రామకృష్ణ, ఎస్‌విఇపి బిపిఎంలు, టి.మురళీకృష్ణ, ఎపిఒలు టి.బాలకోటయ్య, ఎఫ్‌బిఒ ఎపిఎంలు యు. రవికుమార్, పి.శ్రీరామ్ నాగేంద్ర, స్త్రీనిధి మేనేజర్‌లు, పి.అరుణ కుమారి, జడ్ఎస్ ప్రెసిడెంట్ డి.ప్రవీణ, వైస్ ప్రెసిడెంట్ ఒ.కమల, సెక్రటరీ డి.ఆదిలక్ష్మి, జాయింట్ సెక్రటరీ, మండల సమాఖ్య ప్రెసిడెంట్‌లు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జన్మభూమి పార్కు నిర్వహణ బాధ్యత పంచాయతీదే

ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

కలిదిండి రామచంద్ర రాజు జన్మభూమి పార్కులో అన్ని వసతులు కల్పించి, దాని నిర్వహణ చూడాల్సిన బాధ్యత గ్రామపంచాయతీపై ఉందని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. సోమవారం జన్మభూమి పార్క్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పార్కును నిర్లక్ష్యం చేయడం వల్ల పార్క్ బయట ఆక్రమణలు పెరిగిపోవడంతో లోపల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని తన దృష్టికి వచ్చిందన్నారు అందుకే దానిపై దృష్టి సారించి ఆక్రమణలు తొలగించి, పార్కును శుభ్రం చేయించడం జరిగిందన్నారు. టిడిపి హయాంలో పార్కును అభివృద్ధి చేస్తూ నిరంతరం పార్క్‌ను శుభ్రం చేసేందుకు ఒక వ్యక్తిని ఏర్పాటుచేసి సందర్శకులకు ఇబ్బందులు లేకుండా చూసేవారని, దాంతో చిన్నారులు సెలవు రోజుల్లో పార్కులో హాయిగా గడిపే వారని గుర్తు చేశారు. కలిదిండి రామచంద్ర రాజు జన్మభూమి పార్క్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అధికారులు, నాయకులు కృషి చేయాలని, సందర్శకులతో నిత్యం పార్కు కలకలలాడాలని ఆయన సూచించారు. దానికి కావాల్సిన చర్యలను వెంటనే తీసుకుని సందర్శకులకు, చిన్నారులకు పార్కును ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేయాలన్నారు. దాని నిర్వహణ బాధ్యతలు జాగ్రత్తగా చూడాల్సిన పని గ్రామపంచాయతీ అధికారులపై ఉందని ఆయన తెలిపారు. దాతలు పార్కు అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కరిమెరక నాగరాజు, కాగిత బుజ్జి, కొత్తపల్లి నాగరాజు, ముదునూరి కృష్ణంరాజు, కరిమెరక శ్రీనివాస్, ద్వారంపూడి నారాయణరెడ్డి, సత్తి బ్రహ్మారెడ్డి, దాసరి వెంకటకృష్ణ, కందుల బలరాం, చెన్నంశెట్టి హరి నాయుడు, కర్రి శ్రీనివాస్, కునుకు రమాదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రఘురామకృష్ణం రాజు

20 నుంచి డ్వాక్రా సమస్యలపై సర్వే

ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

ప్రజాశక్తి - భీమవరం

ఈనెల 20వ తేదీ నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు డ్వాక్రా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వేలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ పిలుపునిచ్చారు. భీమవరం దుర్గాపురం కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సందక ఉదయ్ కుమారి అధ్యక్షత వహించగా పూర్ణ మాట్లాడారు. నెల రోజుల పాటు డ్వాక్రా సమస్యలపై సర్వేలు నిర్వహించాలన్నారు. సర్వేలు ద్వారా వచ్చిన సమస్యలపై ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పసిపిల్లలపై హింస, అత్యాచారాలు పెరిగాయని వాటికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఐదు నెలల పసిబిడ్డపై అత్యాచారం చేసిన దోషిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం మహిళల సమస్యలు పరిష్కార దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జయప్రభ, డొక్కల లక్ష్మి రాణి, యశోద, సత్యవతి, పార్వతి, సరోజిని, ఏలూరు సీత, వరలక్ష్మి పాల్గొని మాట్లాడారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

మొగల్తూరు: కుష్టి వ్యాధి నివారణకు ఆశాలు, ఎఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఒ.దినేష్ కుమార్ సూచించారు. సోమవారం మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలకు, ఎఎన్ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 18 నుంచి వచ్చే నెల ఆగస్టు 2 వరకు పక్షం రోజులు ఆశాలు, ఎఎన్ఎంలు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి రాగి రంగు స్పర్శ లేని మచ్చలను గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కుష్టు వ్యాధిని ముందుగానే గుర్తిస్తే చికిత్స తీసుకుంటే ఆరు నెలల్లో నయమవుతుందని, కొంచెం ముదిరితే 12 నెలల చికిత్స తీసుకుంటే వ్యాధి నయమవుతుందన్నారు. సమాజంలో కుష్టి వ్యాధిపై వివక్షత ఉండకూడదని ఆయన తెలిపారు.

రాయితీలతో కూడిన రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్టంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ కార్పొరేషన్‌ల ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేసి, ఆయా వర్గాలకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కరరావు కోరారు. సోమవారం మార్టేరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూర్వ ప్రభుత్వాలు అమలు చేసిన ఈ రుణాలను గత వైసిపి ప్రభుత్వం హయాంలో వాటిని నిలిపివేయడం జరిగింది. మరలా ఆయా కార్పొరేషన్ల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల వారికి రాయితీ రుణాలు ప్రవేశ పెట్టి, ఆ వర్గాల వారికి ఉపాధి కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాక పశ్చిమగోదావరి జిల్లాలో చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, చేనేత కార్మికుల్ని ఉపాధి హామీ చట్టంలో చేర్చాలని, కలెక్టర్ వారికి విజ్ఞాపన పత్రం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి
కలెక్టర్‌ను కోరిన నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపియుడబ్ల్యూజె జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా, తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ నాయకులు, లోకల్ పత్రికా సంపాదకులు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి నిర్మాణం, అక్రిడేషన్లలో చేర్పులు, మార్పులు, జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పన వంటి అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నాగరాణి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపియుడబ్ల్యూజె ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గారపాటి ప్రసాద్, తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తమ్మిశెట్టి రంగ సురేష్, ఉపాధ్యక్షుడు చింతకాయల దొరబాబు, భీమవరం ప్రెస్‌క్లబ్ కార్యదర్శి కమ్మిల హనుమంతరావు, సహాయకార్యదర్శి నిమ్మల ఆది, తాడేపల్లిగూడెం, భీమవరం ప్రెస్‌క్లబ్ సభ్యులు వానపల్లి పుండరీకాక్షుడు, జి.వెంకటేష్, చింతపల్లి ఆదిత్య లోకల్ పేపర్ సంపాదకులు ఉన్నారు.

ఎంఎల్‌ఎ నాయకర్‌కు సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసి గెలుపొందిన ఎంఎల్‌ఎ, ఎంపీలను ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా సత్కరించారు. మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం జరగ్గా నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ మేరకు పవన్ ఆయన్ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఎంఎల్‌ఎ నాయకర్ పవన్‌కు పాదాభివందనం చేశారు.

ఫిర్యాదు విచారణ : ఎపిడిఒ సురేష్

ప్రజాశక్తి - పెనుగొండ

ఎన్నికల ముందు ఉపాధి హామీ పనులు చెప్పిన ఫీల్డ్ అసిస్టెంట్ పితాని సత్యనారాయణను తొలగించిన సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని ములపర్రు పంచాయతీ పరిధిలో 'మీకోసం ఆర్జీలో' ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు రావడంతో సోమవారం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేష్ పైఅధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎపిడిఒ సురేష్ మాట్లాడుతూ గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. పైఅధికారులకు సమాచారం అందిస్తామని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పితాని సత్యనారాయణను కొనసాగించాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రహదారులు చిత్తడి అయ్యాయి. కురిసిన కొద్దిపాటి వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారులపైనే నిలిచిపోయింది. దీంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మొగల్తూరు సెంటర్, మొగల్తూరులోని హైస్కూల్ వీధి, ముత్యాలపల్లి మోడీ గ్రామాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారిపై నిలిచిన నీరు బయటకు వెళ్లేలా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆది శైవ అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

గణపవరం: జిల్లాలోని ఆది శైవ అర్చకుల సమస్యలు పరిష్కరించాలని తాడేపల్లిగూడెం, పెంటపాడు, నిడమర్రు, గణపవరం, నల్లజర్ల మండలాల ఆది శైవ అర్చక సంఘం నాయకులు వెలవలపల్లి వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం గణపవరంలో ప్రకటన విడుదల చేశారు. వీరభద్రం మాట్లాడుతూ వంశపారంపర్యంగా వచ్చే అర్చకులకు బదిలీలు ఉండవని అన్నారు. వీరికి సర్వీసు ఇనాం భూములు ఉంటాయని, పనిచేస్తున్న దేవాలయం దగ్గరే వసతి కూడా ఉంటుందని చెప్పారు. నెలసరి ఆదాయాలు తక్కువగా ఉన్నప్పటికీ వంశ పారంపర్యంగా వస్తున్న వారికి వేరే దేవస్థానం వెళ్లడానికి బదిలీలు ఉండవని అన్నారు. ప్రభుత్వం బదిలీ చేస్తే కుటుంబాలు వారిని అనుసరించి ఇబ్బందులు పడతారని అన్నారు. అర్చకులను బదిలీ చేస్తే తమ పిల్లల చదువులకు దీంతోపాటు అధికంగా ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. పూర్వం నుంచి అర్చకులకు బదిలీలు లేవని తెలిపారు. అర్చకులకు ప్రతి జిల్లాలో క్వార్టర్ పాఠశాల ఏర్పాటు చేయాలని, వారి పిల్లలకు పీజీ వరకు ఉచిత విద్య అందించాలని కోరారు.

డైమండ్స్ లయన్స్ ఆధ్వర్యాన కుర్చీల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డైమండ్స్ తరుపున ఫుడ్ కమిటీ లయన్ మానేపల్లి సునీల్ సహకారంతో మున్సిపల్ తొలి ఛైర్మన్ కీర్తిశేషులు డాక్టర్ కోడే వెంకట్రావు 101వ జయంతి వేడుకల సందర్భంగా సోమవారం చిన్నారులకు కుర్చీలు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. పూర్వపు గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు పుట్టినరోజు సందర్భంగా బాలింతలకు కుర్చీలు, భవిత విద్యార్థులకు స్పెషల్ క్లబ్ ఉపాధ్యక్షుడు లయన్ చెన్నా రెడ్డి సతీష్ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రియాంక, జామి సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు లయన్స్ క్లబ్ సమావేశం

ప్రజాశక్తి - గణపవరం

లయన్స్ క్లబ్ గణపవరం సమావేశం ఈనెల 17వ తేదీన సరిపల్లిలో ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో జరుగుతుందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాఘూరి నాగరాజు సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో 24-25 సంవత్సరం సంబంధించిన నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి.సుభాష్ బాబు, ఎన్నికల కమిటీ అధికారి ఈపూరి సత్యనారాయణ, జి.కృష్ణమూర్తి, జోన్ ఛైర్మన్ పోశంశెట్టి రామ్మూర్తి హాజరవుతారని తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం..

ప్రజాశక్తి - ఆచంట

గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిన పలు అభివృద్ధి పనులను కొత్త ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. ఆచంట మండలం కొడమంచిలి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.43.6 లక్షలతో సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించ తలపెట్టిన రైతు భరోసా కేంద్రం పనులు నిధులు సమస్యతో పునాదులతోనే నిలిపివేశారు. అసంపూర్తిగా నిలిచిన పనుల విషయం స్థానిక ప్రజాప్రతినిధులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఆదేశాలతో అసంపూర్తిగా నిలిచిన ఆయా పనులను తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పెనుమంట్ర : ఈనెల 16వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కెవిఎస్.రెడ్డి(వాసు రెడ్డి) అధ్యక్షతన జరుగుతుందని, అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి పనులను సమీక్ష చేయడం జరుగుతుందని ఆమె అన్నారు.

ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల హెచ్‌ఆర్‌డి ఆధ్వర్యంలో ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్‌ఆర్‌డి కమిటీకి చెందిన వేదాంతం చెంచు మూర్తి పాల్గొని మాట్లాడుతూ పార్కు ఆలోచన నైపుణ్య విధానం, తద్వారా ఉపయోగాలు, అవి మన నిత్య జీవితంలో ప్రాక్టికల్‌గా ఎలా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రత్యక్ష, సమాచార నైపుణ్యాలను పెంపొందించుకున్నట్లైతే జీవితంలో సాధించలేనిది ఉండదని తెలిపారు.

జిపిఎస్ గెజిట్‌ను రద్దు చేయాలి

పెనుమంట్ర : ఇటీవల సిపిఎస్ స్థానంలో వెలువడిన జిపిఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు, పివిఎన్.ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జిపిఎస్ గెజిట్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఇవ్వడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

31న బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 31న కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసెఫ్ తెలిపారు. 19, 20 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు న్యాయవాదుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

ఆదర్శ మహిళ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

జయంతి సందర్భంగా నలుగురు ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆదర్శ మహిళ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అని, స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ అనుచరురాలుగా, ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని ఇన్నర్ వీల్ క్లబ్ ప్రాజెక్ట్ కన్వీనర్ గంధం శ్రీదేవి అన్నారు. జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో పిఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో దుర్గాబాయ్ జయంతిని పురస్కరించుకుని నలుగురు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా గంధం శ్రీదేవి మాట్లాడుతూ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ రాజమండ్రిలో రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారని, 1931-1933 వరకు మూడు పర్యాయములు బ్రిటీష్ వారు అరెస్టు చేసారని, భారత రాజ్యాంగ సభలో దుర్గాబాయ్ సభ్యురాలుగా వున్నారని, అటువంటి మహిళా మూర్తిని భావితరాల వారికి తెలియచెప్పాలని అన్నారు. అనంతరం రచయిత్రి, ఉపాధ్యాయుని కె.మాధవీలత, చిట్టి కుమారి, సునీత మాట్లాడుతూ 1923లో దుర్గాబాయ్ కాకినాడలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించారని, విద్యాభిక్షణ, నిరుపేద మహిళలు, పిల్లలు, వికలాంగుల కోసం పునరావృత కేంద్రాలు ఆనాడే నిర్వహించారని, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆదర్శ మహిళా సంఘాలు ఈనాటికీ నడుస్తున్నాయని అన్నారు. జిల్లా సర్వోదయ మండలి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి త్వరలో జిల్లాలోని మహిళా సంఘాలను ఎంపిక చేసి దుర్గాబాయ్ పేరిట అవార్డులు అందిస్తామని చెప్పారు. గంధం శ్రీదేవి, ఉపాధ్యాయులు మాధవీలత, సునీత, వారణాసి రాధాకృష్ణలను అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వారిని సత్కరించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రమణ్యం, కలిగోట్ల గోపాల శర్మ, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆచంటలో కుళాయిలు నిలిపివేత

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట గ్రామంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీ వాటర్ ట్యాంకులు శుభ్రపరచు నిమిత్తం కుళాయిలు ఒక్కరోజు నిలిపి వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జివిఎస్ఎల్ నరసింహారావు సోమవారం విలేకరులకు తెలిపారు. కావున ఆచంట టౌన్ సంబంధించి ప్రజలకు టామ్ టామ్ ద్వారా ఈ విషయం తెలియపరచినట్లు ఆయన వివరించారు. కావున ప్రజలందరూ తమకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సభ్యత్వ నమోదులో అందరికీ ఆదర్శం కావాలి..

ప్రజాశక్తి - ఉండి

సభ్యత్వ నమోదులో ఇతర నియోజకవర్గాలకు ఉండి నియోజకవర్గం ఆదర్శంగా ఉండాలని జనసేన పిఎసి సభ్యులు వేగేశ్న కనకరాజు సూరి, డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల రత్నం అన్నారు. సోమవారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కనకరాజు సూరి, ముత్యాల రత్నం మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 28 వరకు జరిగే సభ్యత్వ నమోదు ప్రక్రియలో ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా ఉండి నియోజకవర్గం ఉండేలా సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని వారు సూచించారు. జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్ని పార్టీల వారు తమ పార్టీ వైపు చూస్తారని, అటువంటి అవకాశవాదులకు పార్టీ సభ్యత్వం ఇవ్వకుంటే మంచిదని తన అభిప్రాయాన్ని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన ప్రతి జనసైనికునికి, తన వెన్నంటే నిలిచిన జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఉత్తమ యూనిట్‌గా యూత్ హాస్టల్స్ ఎంపికపై హర్షం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఉత్తర దక్షిణ భారతదేశంలో యూత్ హాస్టల్స్ ఉత్తమ యూనిట్‌గా ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం శాఖ ఎంపిక అవ్వడం పట్ల శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం వెంకట్రామ థియేటర్ కన్వెన్స్ హాల్‌లో యూత్ హాస్టల్స్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మాట్లపూడి సత్యనారాయణను సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ పాక సత్యనారాయణ మాట్లాడుతూ అసోసియేషన్ స్థాపించడం కాదని, దానిని అభివృద్ధి పథంలో తీసుకుని వెళ్లినప్పుడే ఆ సంస్థల విలువలు పెరుగుతాయని అన్నారు. భీమవరంలో అనేక సంస్థల అసోషియేషన్లు దశాబ్ద కాలంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ యువతలో స్ఫూర్తిని నింపుతుందని తెలిపారు. ప్రస్తుత తరుణంలో యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, యూత్ హాస్టల్స్ యువతలో మంచి చైతన్యాన్ని నింపడానికి ఉపయోగకరంగా ఉండటం గొప్ప విశేషమని తెలిపారు. ఈ అవార్డు పొందిన యూత్ హాస్టల్స్ యూనిట్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ యూనిట్ సభ్యులు కట్రెడ్డి సత్యనారాయణ, సిహెచ్.గాంధీ, పేరిచర్ల లక్ష్మణ్ వర్మ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, నరహరిశెట్టి కృష్ణ, కొండ్రు శ్రీనివాస్, గోపిశెట్టి మురళీకృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కాళ్ల



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

కాళ్లకూరు గ్రామం సోమరాజు గరువుకు చెందిన వెలుదుర్తి వెంకట రమణమ్మ(65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ దాట్ల వెంకట రామరాజు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ట్రస్ట్ సభ్యులు కోలా ఆంజనేయులు, పెన్మెత్స నాగరాజు, ఈదా భోగేష్‌లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

డ్రెయినేజీ, సిమెంట్ రోడ్ల పనుల పర్యవేక్షణ

తాడేపల్లిగూడెం: స్థానిక ఒకటో వార్డు ముస్లిం కాలనీలో రూ.33 లక్షలతో డ్రెయినేజీ, సిమెంట్ రోడ్ల పనులు సోమవారం జనసేన టౌన్ ప్రెసిడెంట్ వర్తనపల్లి కాశి, ఒకటవ వార్డు జనసేన ఇన్‌ఛార్జి చాపల రమేష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వర్తనపల్లి కాశీ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ రూ.10 కోట్లతో నియోజకవర్గ పనులు మొదలు పెట్టారని, అందులో భాగంగా స్థానిక ఒకటవ వార్డు ముస్లిం కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ అవుట్ పనులు ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నెల రోజులలో రూ.10 కోట్ల అభివృద్ధి పనులు మొదలెట్టడం ఒక బొలిశెట్టికే సాధ్యమన్నారు. గత ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి అందరికీ తెలిసిన విషయమేనని, ఎన్నికల సమయంలో పల్లెపోరు, ప్రచార కార్యక్రమాల్లో ఎంఎల్‌ఎ ప్రజా సమస్యలు తెలుసుకుని రోడ్లు, డ్రెయినేజీ పరిస్థితులు చూసి ఎప్పటికప్పుడు ప్రభుత్వ పాలనను ఎండగట్టినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నియోజకవర్గంలో అనేక పనులతో పాటు ఒకటవ వార్డులో సీసీ రోడ్డు వేస్తున్నందుకు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కేశవభట్ల విజయ్, బయనపాలేపు ముఖేష్, గొంపా లోవరాజు, అధికారులు పాల్గొన్నారు.

అప్పారావుకు అభినందనలు : కెవిపిఎస్

భీమవరం: జిల్లా అధికారిగా ఉంటూ తూర్పుగోదావరి జిల్లా వచన కవిత్వం-ఆర్థిక, రాజకీయ, సామాజిక దృక్పథం అనే అంశంపై డాక్టరేట్ పొందిన గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి కెసిహెచ్.అప్పారావుకు కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్ కుమార్, కె.క్రాంతిబాబులు అభినందనలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో అప్పారావును నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. ఒకవైపు జిల్లా అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ, మరోవైపు సమాజ అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. కవిత్వంలో కూడా సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాల్లో సమాజాన్ని విశ్లేషించడం గొప్ప విషయం అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు, కుసుమ ధర్మన వంటి సంఘ సంకర్తలు, కవులు పుట్టిన ప్రదేశంలో డాక్టరేట్ పొందడం ఆనందదాయకమన్నారు. ద్రవిడ యూనివర్సిటీలో ఈ అంశంపై సమగ్ర విశ్లేషణ చేశారని తెలిపారు.

మావుళ్లమ్మకు సారె

భీమవరం టౌన్: మావుళ్లమ్మ అమ్మవారికి కొప్పనర్తి ప్రభాకర్ రెడ్డి, శ్రీవాణి దంపతులు ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం సారె సమర్పించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందచేశారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలియజేశారు.

వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

బాల బాలికల వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. సోమవారం కనుమూరి రఘురామకృష్ణంరాజు ఉండి బిసి సంక్షేమ బాలుర వసతి గృహాన్ని, ఎస్‌సి సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల వార్డెన్‌లు పలు సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ గతంలో నిరుపేద తల్లిదండ్రులు వారి పిల్లలకు పౌష్టికాహారం ఇచ్చి చదివించుకునే స్తోమత లేక ఊరికి దూరంగా వసతి గృహాల్లో చదివించే వారని, కానీ నేడు వాటి పరిస్థితి అధ్వానంగా ఉండటంతో వాటిలో తమ పిల్లలను చదివించుకోలేక నిరుపేద తల్లిదండ్రులు చిన్నారుల చదువులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని వసతి గృహాల్లోనూ మెరుగైన సదుపాయాలు కల్పించి, వాటిలో విద్యార్థులు చేరి చదువుకునేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సరిపోకపోతే ఉండి డెవలప్మెంట్ ఫండ్ నుంచి నిధులు వసతి గృహాల అభివృద్ధికి కేటాయించే ఏర్పాట్లు చేస్తానని ఆయన తెలిపారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమని, దానికి కావలసిన ఏర్పాట్లు చేసి ఆగస్టు నెలాఖరులోగా వసతి గృహాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తానని రఘురామకృష్ణంరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, నాయకులు కొత్తపల్లి నాగరాజు, ముదునూరి కృష్ణంరాజు, మంతెన సాయిలచ్చిరాజు, తోట శ్రీరాములు, కల్లేపల్లి సతీష్ రాజు, ఉండ్రు ఇస్సాకు, ఎంపిటిసిలు కునుకు రమాదేవి శ్రీనివాస్, దంగేటి రామలింగేశ్వరరావు, రుద్రరాజు యువరాజు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

కాళ్ల: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాలువల్లో చెత్తాచెదారంతో పేరుకు పోవడంతో మురుగు నీరు ముందుకెళ్లలేక రోడ్డుపై ప్రవహిస్తోంది. రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉంటున్నది, దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. మండలంలోని ఏలూరుపాడు, కాళ్లకూరు, సిసలి, ఎల్ఎన్ పురం, బొండాడ, బోస్ కాలనీ, కోలనపల్లి, కోమటిగుంట, పల్లిపాలెం, కలవపూడి, మోడీ, మాలవానితిప్ప గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వర్షపు, మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో స్థానికులే కాకుండా ఆ రహదారి గుండా వాహన దారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పలు వీధుల్లో కచ్చా డ్రెయిన్ తవ్వకం పనులు చేయకపోవడంతో మురుగునీరు వెళ్లడం లేదు. డ్రెయినేజీల్లోని మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమల ఉత్పత్తితో రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. దోమల వల్ల విషజ్వరాల బారిన పడుతున్నామని, అయినా గ్రామ సర్పంచి, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లించడం లేదని తెలుపుతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి డ్రెయినేజీలను శుభ్రం చేయించి, కచ్చా డ్రెయిన్ తవ్వకం పనులు చేపట్టి, మురుగునీరు రోడ్డుమీదకు రాకుండా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

శశి కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ

తాడేపల్లిగూడెం: వర్షాకాలంలో ప్రజలు మొక్కలను విరివిగా నాటాలని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ కృషి చేయాలని శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ అన్నారు. శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకంలో భాగంగా సోమవారం పెదతాడేపల్లి రహదారి మార్గంలో కళాశాల వాలంటీర్ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను గ్రామ ప్రజలు, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షేక్ సల్మాన్ బాషా, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు. పర్యావరణం పరిరక్షణలో మేము సైతం అంటూ ఐటిసి సహకారంతో ఎజివా సోమవారం నిర్వహించిన వావ్ కార్యక్రమంలో ఆదిత్య స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించి విద్యార్థులు సేకరించిన పాత పుస్తకాలు, పేపర్లను నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆదిత్య స్కూల్ ప్రిన్సిపల్ కె.వాసుదేవ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగమైన చెట్లను కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. రీజనల్ కోఆర్డినేటర్ ఎన్.రాము మాట్లాడుతూ ఒక టన్ను పేపరు తయారు చేయాలంటే 17 చెట్లు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..

తణుకు : కృషి, పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చునని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల కరస్పాండెంట్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్య ఉషారాణి అన్నారు. సోమవారం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ఆవరణలో గల చిట్టూరి సత్యఉషారాణి ఇండోర్ స్టేడియం నందు ఈనెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు పశ్చిమగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

మురుగునీరు తొలగించాలని గ్రామస్తుల ఆందోళన

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో డ్రెయినేజీ నుంచి మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సోమవారం గ్రామంలో ప్రజలు నిరసన ప్రదర్శన చేశారు. దుకాణాల నుండి వచ్చిన మురుగునీరు, వర్షపు నీరు డ్రెయిన్‌లో నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. అధిక వర్షం కురిసినప్పుడు అదే నీరు రహదారిపై ప్రవహిస్తుంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు డ్రెయినేజీని ప్రక్షాలనను చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తుల కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవాకర్త నాగిడి రాంబాబు, కొప్పాడి దుర్గ, నాగరాజు, సత్యనారాయణ త్రివేణి పలువురు గ్రామస్తులు ఉన్నారు.

పంట పొలాల పరిశీలన

ఉండి: ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా ముంపుకు గురైన నారుమడులను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పి.వినయ లక్ష్మి, బి.రజిత క్షేత్రస్థాయిలో సందర్శించారు. వివిధ దశలలో దెబ్బతిన్న వరి పంటను కాపాడుకోవడానికి రైతులకు పలు సూచనలను ఇచ్చారు.

మంత్రి సవితను కలిసిన నాయకర్

నరసాపురం: రాష్ట్ర బిసి సంక్షేమ, ఇడబ్ల్యూఎస్ మంత్రి ఎస్.సవితను మంగళగిరిలో నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నరసాపురం నియోజకవర్గంలోని బిసి హాస్టల్స్, సాంఘిక సంక్షేమ హాస్టల్స్ పరిస్థితిని ఆమెకు వివరించారు. నరసాపురం నియోజకవర్గం హాస్టల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి, అభివృద్ధి చేయాలని అన్నారు.

రాయితీలతో కూడిన రుణాలు ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ కార్పొరేషన్‌ల ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేసి, ఆయా వర్గాలకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కరరావు కోరారు. సోమవారం మార్టేరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూర్వ ప్రభుత్వాలు అమలు చేసిన ఈ రుణాలను గత వైసిపి ప్రభుత్వం హయాంలో వాటిని నిలిపివేయడం జరిగింది. మరలా ఆయా కార్పొరేషన్ల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల వారికి రాయితీ రుణాలు ప్రవేశ పెట్టి, ఆ వర్గాల వారికి ఉపాధి కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాక పశ్చిమగోదావరి జిల్లాలో చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, చేనేత కార్మికుల్ని ఉపాధి హామీ చట్టంలో చేర్చాలని, కలెక్టర్ వారికి విజ్ఞాపన పత్రం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎంఎల్‌ఎ నాయకర్

నరసాపురం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను సోమవారం నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మంగళగిరి ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి పలు సమస్యలు వివరించారు. నరసాపురం మండలంలోని వేములదీవి ఈస్ట్ మత్స్యకార హాస్టల్‌ను స్థలం కేటాయించి జూనియర్ కాలేజీగా మార్చాలన్నారు. లక్ష్మణేశ్వరంలో అద్దె భవనంలో కొనసాగుతున్న బిసి రెసిడెన్షియల్ గర్ల్స్ హాస్టల్‌కు స్థలం కేటాయించి, సీట్ల సంఖ్యను పెంచాలని నాయకర్ కోరారు. నియోజకవర్గంలో పలు సమస్యలను పరిష్కరించాలని మంత్రిని ఎంఎల్‌ఎ నాయకర్ కోరారు.

మహారాజశ్రీ అమలాపురం 2వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
A.S. No. 43/2023

Between:
తుమ్మలపల్లి శ్రీ లక్ష్మి గంగమాంబ
-అప్పిలెంటు (7వ ప్రతివాది)
Vs
1. పులవర్తి వీర వెంకట శేషారత్నం, వగైరాలు
-రెస్పాండెంట్లు

అప్పీలు సమను అమలు నిమిత్తము
5వ రెస్పాండెంటు (4వ ప్రతివాది):
కొత్త నాగ రాజకుమారి, W/o. వీర వెంకట సత్యన్నారాయణ, C/o. వి.వెంకటరావు, డో.నెం. 16/బి, 11-10, తంగెళ్ళమూడి, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా.

పై నంబరు అప్పీలులో 5వ రెస్పాండెంటు అయిన మీకు పై నంబరు అప్పీలుకు సంబంధించి అప్పీలులో నోటీసులు కోర్టు వారు యిచ్చిన ఉత్తర్వులు ప్రకారము కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్ పోసు ద్వారా పంపించినప్పటికి కోర్టు వారు యిచ్చిన వుత్తర్వులు ప్రకారము పేపరు ద్వారా ప్రకటన చేయడము అయినది. పై నంబరు అప్పీలులో 5వ రెస్పాండెంటు అయిన మీరు కోర్టులో హాజరు అవుటకు **వాయిదా 08-08-2024కు వాయిదా వేసినారు.** సదరు తేదీన మీరు స్వయముగా గాని లేదా మీ లాయరు గారి ద్వారా పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియపరచుకొనవలసినదిగా కోరడము అయినది. లేనియెడల తీర్పు మీకు పరోక్షముగా తీర్మానించబడును.

పొన్నాడ సూర్యారావు
అప్పీలెంటు తరపున న్యాయవాది
రాజోలు రాజోలు
ది.7-7-2024 సెల్:9849123496

మహారాజశ్రీ 5వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 1129/2022

Between:
Guttula Sattiraju ...*Plaintiff*
AND
Penumatsa Vamsi Krishna Raju, S/o. late Rama Krishna Raju, Hindu, Inam, age 25 years, C/o. Penumatsa Vital Raju, Kanchirajugari Street, Opp: Town Hall Complex, Tanuku, W.G.Dist., ...*Defendant*

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 18-7-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **జి.ఎస్.ఎస్.మురళీమోహన్**
10-7-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ IVth అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ అడిషినల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టు, ఏలూరు
O.S.No.321/2022

Between:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
బజారు బ్రాంచి, ఏలూరు. ...Plaintiff
And
Sambaladeevi Sunitha,
D/o.Suryanarayana, Hindu, Female,
Aged about 31 Yrs, D.No.3-36,
R/o.Arepalli Someswararao Complex,
Vissakoderu, W.G.Dist.
...Defendant

పై ఉదహరించిన ప్రతివాది నోటీసు /దావా సమను నిమిత్తం **ది.18-07-2024**న ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరయి మీకు ఆక్షేపణలు ఉన్నచో శ్రీకోర్టు వారి ముందు తెలుపుకొని చెప్పుకోవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించుదురు.

కె.సుబ్రహ్మణేశ్వరస్వామి
Eluru Advocate, Eluru.
Dt.6-7-24 Cell : 9440181117

మహారాజశ్రీ 1st Additional సివిల్ జడ్జి (Junior Division) వారి కోర్టు Tadepalligudem
O.S. 593/2022,

Plaintiff:
Penumarthi Ramalakshmi
Defendant:
Bodaballa Srinivasarao @ Srinivas
To:
Bodaballa Srinivasarao @ Srinivas S/o. Subbarao, D.No. 11-22-32/1A, Narasimharaopeta, Tadepalligudem, TPG JCJC.

పై నెంబరు దావాలో ప్రతివాది ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను సదరు దావా సంగతులు తెలిసి యుండి సదరు సమన్లు తీసుకొనకుండా evade చేయుచున్నందున substituted service ద్వారా అమలు జరుపుటకు వుత్తర్వులు యిచ్చి **ది. 28-08-2024కి** వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున **ఉదయం గం. 10-30 ని.లకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

KUSULURI SIVA RAMA KRISHNA
Tadepalligudem Advocate for Plaintiff
Dt: 15-07-2024 Tadepalligudem - 534 101
Ph: 9949076266

మహారాజశ్రీ 11వ అదనపు జిల్లా జడ్జి : తెనాలి
ఈ.పి. 52/2022 ఇన్ ఓ.యస్.386/2012

బిట్వీన్:
కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి .....డి. హెచ్.ఆర్
ఎదిరి
తానిగుండాల లక్ష్మీ మరియు ఇతరులు ... జె.డి.ఆర్స్.
1. తాని గుండాల లక్ష్మీ (1వ జె.డి.ఆర్)
భర్త జయప్రకాష్ రెడ్డి (లేటు)
2. తానిగుండాల ఉదయ ప్రకాష్ రెడ్డి (2వ జె.డి.ఆర్)
తండ్రి జయప్రకాష్ రెడ్డి (లేటు)
1, 2, వారలు డోర్ నెం.20-8-9/7, సాయిబాబా గుడి వద్ద, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా.
3. తానిగుండాల ప్రియాంక తండ్రి విజయకుమార్ రెడ్డి డోర్ నెం. 1-10-19, చెరువు వారి వీధి, నాజరుపేట, తెనాలి.

సదరు ఈ.పి. నందు మీరు 1,2,6 జె.డి.ఆర్స్ అయి వున్నారు. సదరు పై ఈ.పి 11వ అదనపు జిల్లా కోర్టు నందు ఓ.యస్ నెం.386/2012 నందు వున్నటువంటి సొమ్మును జప్తు చేయు నిమిత్తము మీపై పై తెల్పిన ఈ.పి. పెండింగులో వున్నది. దరిమిలా సదరు ఈ.పి.లో మిమ్ములను 1, 2, 6వ జె.డి. ఆర్స్ అయిన మీకు కోర్టు వారు నోటీసులు పంపినను తీసుకొనక, జారీ అవ్వక, కాలయాపన జరుగుచున్నందున సదరు కోర్టు వారి ఆర్డరు ప్రకారం 1, 2, 6 జె.డి.ఆర్ పై ఆర్డర్ 21, రూల్ 52 నోటీసు మీకు పేపరు ప్రకటన ద్వారా కోర్టు నోటీసు ది. 19-07-2024 వాయిదా గలదని తెలియజేయడమైనది. సదరు వాయిదా ది.19-7-2024న 1, 2, 6 జెడి.ఆర్గ అయిన మీరు కాని, లేక మీ అడ్వకేట్ గారి ద్వారా గాని పె తెల్పిన కోర్టులో ఉదయం 10-30 ని॥లకు హాజరు కావలెను, కానిచో మిమ్ములను కోర్టు వారు పిలిచి మీ పరోక్షమున ఈ.పిని తీర్మానించి తదుపరి ఉత్తర్వులు జారీ చేయబడునని ఇంద మూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేది. 19-07-2024

యమ్.ఏ.హమీద్ బేగ్,
వాది తరపు న్యాయవాది,
తెనాలి **తెనాలి.**